


నలుగురు టీచర్లకు మెమో

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి మోడల్ ప్రైమరీ పాఠశాలలో పనిచేస్తున్న ఇంఛార్జి ప్రధానోపాధ్యాయుడితో పాటు మిగిలిన ముగ్గురికి మెమో జారీ చేస్తున్నట్లు ఎంఇఒ శ్యాంసుందర్ తెలిపారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో తల్లిదండ్రులకు విద్యార్థులు పాదాపూజ చేసేందుకు నడిరోడ్డుపై తల్లిదండ్రులు కూర్చొండ బట్టి పిల్లలతో పాదపూజ మండుటెండల్లోనూ, ముఖ్యమంత్రికి పాలాభిషేకం స్థానిక నాయకులతో చేయించడం ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనడంపై సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు విద్యాశాఖ వెంటనే స్పందించి, నలుగురు ఉపాధ్యాయులకు మెమో జారీ చేసినట్టు ఎంఇఒ తెలిపారు

నాడు వద్దన్నారు... నేడు చేయాలంటున్నారు


- కలగా మిగిలిన కాలువల పూడికతీత పనులు
- ఆయకట్టు భూములకు సాగునీరందని పరిస్థితి
- చోద్యం చూస్తోన్న పెద్దగెడ్డ అధికారులు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు భూములకు సాగునీరందే పరిస్థితి కనిపించడం లేదు. కొద్దిరోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. వర్షాలు విరివిగా పడుతున్నాయి. రైతులు వరి నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. నారుమడులు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికీ పెద్దగెడ్డ జలాశయం నుంచి సాగునీరు ప్రవహించే కాలువల్లో పూడికతీత పనులు పూర్తి కాలేదు. నిధులున్నా పనులు చేయలేని దుస్థితి నెలకొంది. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరందే అవకాశం లేదు. కాలువలన్నీ తుప్పలు, డొంకలతో నిండి ఉన్నాయి. ఏడాది కాలంగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీరు ప్రవహించే పరిస్థితి లేదు.

పనులు ప్రారంభించి ఎందుకు ఆపేశారు?

పెద్ద గెడ్డ జలాశయం నుంచి సాగునీరందించే కాలువల పూడికతీత పనులకు నిధులు సిద్ధంగా ఉన్నా పనులు పూర్తి చేయకపోవడం వెనుక అధికారపార్టీ నాయకుల జోక్యం పెరగడమేనని తెలుస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో స్థానిక గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నాయకత్వంలో సాగునీటి సంఘాలను టిడిపి నాయకులు కైవసం చేసుకున్నారు. అంతవరకు బాగానే ఉంది. పెద్దగెడ్డ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కాలువల పూడికతీత పనులకు స్టేట్ డిజాస్టర్ మేనేజ్మెంట్ నిధులు రూ.91 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు చేయడానికి పెద్దగెడ్డ అధికారులు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఖరారు చేశారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పూడికతీత పనులు ప్రారంభించారు. అయితే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్లంతా వైసిపికి చెందిన వారనే నగ్న సత్యాన్ని టిడిపికి చెందిన సాగునీటి సంఘాల నాయకులు గుర్తించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో వైసిపి కాంట్రాక్టర్లు పనులు చేయడమేమిటని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారు చెప్పిందే తడవుగా మంత్రి ఎక్కడ పనులు అక్కడే ఆపాలని ఆదేశించడంతో అధికారులు ఆఘమేఘాలపై పనులు నిలిపివేయించారు. మార్చిలో పూర్తి కావాల్సిన పనులను మంత్రి ఆదేశాలతో అధికారులు నిలిపివేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత ఇప్పుడు అధికారులు కాంట్రాక్టర్లను పిలిచి పనులు చేయాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే కాంట్రాక్టర్లు అందుకు సుముఖత చూపడం లేదు. నాలుగు నెలల క్రితం పూర్తి చేయాల్సిన పూడికతీత పనులను వరి నాట్లకు సిద్ధమవుతున్న తరుణంలో చేయాలని కోరడమేమిటని ప్రశ్నిస్తున్నారు. మార్చిలోనే 30శాతం వరకు పనులు చేసిన తర్వాత నిలిపివేయాలని ఆదేశించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



తుప్పలు, డొంకాలతో పేరుకుపోయిన సాగునీటి కాలువు

ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకమే

రానున్న ఖరీఫ్ సీజన్‌కు ఆయకట్టు భూములకు సాగునీరందే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మార్చిలో చేసిన పనులను నిలిపివేయడం, రైతులకు సంబంధించిన అంశాల్లో రాజకీయ జోక్యం చేసుకోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో పెద్ద గెడ్డ జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నీరు ఆయకట్టు భూములకు అందే అవకాశం లేదు. ఈ విషయాన్ని కొంతమంది పార్టీ పెద్దలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీరందకపోతే రైతులు ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. దీంతో పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి అనుచరులు కోరారు. వర్షాలు ముమ్మరంగా పడుతున్న సమయంలో సిమెంట్‌తో చేయాల్సిన స్లూయిస్‌ల నిర్మాణ పనులు ఎలా చేస్తామని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయకట్టు భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతోంది.



సగం వరకు పనులు చేసిన నిలిచిపోయిన కాలువ

16 నుంచి పారిశుధ్యంపై అవగాహన : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఈనెల 16 నుంచి 30 వరకు చేపట్టనున్న ప్రత్యేక పారిశుధ్య పక్షోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో పారిశుధ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సమయంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వచ్ఛమైన తాగునీరు, అనిమియా కమిటీల నిర్వహణ వంటివి చేపట్టాలని సూచించారు. పారిశుధ్య పక్షోత్సవాలు, పిఎం సూర్యఘర్, వెక్టర్ హైజీన్ యాప్ తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా అన్ని గ్రామాల్లో మురుగునీటి కాలువల్లోని పూడికను తీయించడం, బ్లీచింగ్ వేయడం, చెత్తను శుభ్రం చేయడం, తొలగించిన చెత్తను చెత్త సేకరణ కేంద్రాలకు తరలించడం లేదా గ్రామానికి దూరంగా పారవేయాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సామాగ్రి, లేబర్, బ్లీచింగ్, ఇతర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అన్నారు. అలాగే గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం, నీటి పరీక్షలు నిర్వహణ, మరమ్మతులకు గురైన పైపులను మార్చడం వంటివి చేపట్టాలని చెప్పారు. పారిశుధ్యం, తాగునీరు, ఇతర కార్యక్రమాలకు అవసరమైన పనులను గ్రామ కమిటీ తీర్మానంతో సిద్ధం చేసుకోవాలని వివరించారు. ప్రతీ ఒక్కరూ మరుగు దొడ్లను వినియోగించుకొని బహిరంగ మల విసర్జనకు స్వస్తి పలికేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. పక్షోత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేయించాలన్నారు. స్వర్ణంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని మూడో శనివారం నిర్వహించాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈ పారిశుధ్య డ్రైవ్ నందు చేపట్టాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.



జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అపారిశుధ్యం, కలుషిత నీటి వల్ల మలేరియా, అతిసారం, కలరా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి నిల్వలు లేకుండా సూచించాలని, యాంటీ లార్వా ఆపరేషన్ తప్పనిసరిగా జరగాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మలాథియన్ స్ప్రే చేయించాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, మండల వైద్యాధికారులు తప్పనిసరిగా తమ ప్రాంతంలోని పిహెచ్‌సిలను సందర్శించి, ఎటువంటి మలేరియా కేసుల్లేకుండా చూడాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వెక్టర్ హైజీన్ యాప్ ఖచ్చితంగా వినియోగించాలని స్పష్టం చేశారు. పారిశుధ్యం, మలేరియా నివారణ చర్యలు, అనీమియా యాక్షన్ కమిటీలు తదితర అంశాలను ప్రజలకు వివరించాలని అన్నారు. అనంతరం పీఎం సూర్యఘర్ పై కలెక్టర్ సమీక్షిస్తూ ఈ నెలాఖరులోగా వెయ్యి యూనిట్లు జిల్లాలో గ్రౌండింగ్ కావాల్సి ఉందన్నారు. కావున నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ ఒ.ప్రభాకరరావు, ఎపిఇపిడిసిఎల్ కె.మల్లికార్జున, డిఎల్‌డిఒ రమేష్ రామన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల కోసం దరఖాస్తుల స్వీకరణ

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సబ్జెక్ట్‌లకు గెస్ట్ లెక్చరర్ పద్ధతిలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం పేర్కొన్నారు. ఈనెల 15లోగా తమ జెరాక్స్ కాపీలను సమర్పించాలన్నారు. 16న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు శుక్రవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యశాఖ అధికారులు, వైద్య సిబ్బందితో కలిసి జిల్లా ఆసుపత్రి వరకు నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జననం, ఆరోగ్యవంతమైన భవిష్యత్ తరం లక్ష్యంగా ఈ ఏడాదికి గానూ ప్రధాన సారాంశంగా ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం ఉండాలనే థీమ్‌పై, తల్లి కావడానికి సరైన వయస్సు, శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అందువల్ల పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, కుటుంబ వ్యవస్థను సరిగా నడిపే సమర్థత, ఆలోచనా పరిణితి ఉంటాయని అన్నారు. అలాగే కాన్పుకు కాన్పుకు ఎడం ఉండాలని ఇందుకు తాత్కాలిక కుటుంబ నియాత్రణ పద్ధతులు అవలంబించాలని సూచించారు. వీటిలో ప్రధానంగా కాపర్ టి, పిపిఐయూసిడి, గర్భనిరోధక మాత్రలు, కండోమ్, అంతర ఇంజక్షన్ అందుబాటులో ఉన్నాయన్నారు. బాల్యవివాహాల నిరోధంపై అవగాహన పెంపొందించాలన్నారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా ఉన్న కాలంలో జనాభా వృద్ధి శాతం ఉండేదని, తర్వాత కాలంలో ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పులు రావడం, చిన్న కుటుంబాలు, ఆలస్య వివాహాలు, పిల్లలు కన్నాక ఆరోగ్యం సహకరించకపోవడం వంటి కారణాలు శిశు వృద్ధి రేటు తగ్గుతూ వచ్చిందని తెలిపారు. వీటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించి జీవన ప్రమాణాలు మెరుపడ్డానికి ఆరోగ్యకరమైన సామాజిక వ్యవస్థ ఏర్పడి ఉజ్వలమైన భవిష్యత్ నిర్మాణంలో అందరూ ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్, పిపియూనిట్ వైద్యాధికారులు డాక్టర్ వై.విజయ్ మోహన్, డాక్టర్ లావణ్య, ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ కౌశిక్, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు రవిచంద్ర, గణేష్, డిపిఒ లీలారాణి, డెమో సన్యాసిరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పుష్ప, ఇందిర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం కళాశాల ప్రిన్సిపాల్ సుశాంత్ జన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా నియంత్రణ - చిన్న కుటుంబం అన్న అంశం అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ఎస్ పిఒ వి.ప్రభాకరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు అపోహాలు జనాభా పెరుగుదలకు గ్రామీణ ప్రాంతాల్లో కారణం అవుతున్నాయని అన్నారు. కావున వివేకంతో ఆలోచించి ప్రజల్లో ఈ అంశాలపై చైతన్యం కల్పించాలని కోరారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్న నినాదం పాటించాలని కోరారు.

కార్యక్రమంలో అధ్యాపకులు రవికిరణ్ కుమార్, మంజుల, రవికుమార్, ఫణి కుమారి, విజయలక్ష్మి, శంకరరావు, తమ్మయ్య, రామకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాపినాయుడు

ప్రజా చైతన్యమే ధ్యేయంగా పని చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజలను చైతన్యపర్చడమే ధ్యేయంగా ప్రజానాట్యమండలి కళాకారులు పని చేయాలని సీనియర్ కళాకారులు దుప్పాడ పాపినాయుడు కోరారు. శుక్రవారం ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాపినాయుడు మాట్లాడుతూ కళ కళ కోసం కాదని, కళ ప్రజల కోసం, ప్రగతి కోసమని భావించి ఆనాడు డాక్టర్ గరికపాటి రాజారావు స్ఫూర్తితో ప్రేరణతో ప్రారంభించిన మండలిలో వేలాదిమంది కళాకారులు పనిచేస్తున్నారని చెప్పారు. శాస్త్రీయమైన కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయడం, మూఢనమ్మకాల నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రాథమిక విద్య గురించి చెబుతూ ఎన్నో చైతన్యవంతమైన నృత్య రూపాలు, నాటికల ద్వారా ప్రజల్లోకి వస్తుంది ప్రజానాట్యమండలి అని అన్నారు. ఆగస్టు 15న దేశభక్తి, అభ్యుదయ గీతాలకు సంబంధించిన పాటల పోటీలు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతాయని, ఈ పోటీల్లో ఉత్సాహవంతులు పాల్గొని దేశభక్తి గేయాలను ఆలపించాలని కోరారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం రమణ మాట్లాడుతూ అనేకమంది కళాకారులు ఎలాంటి ఆధారం లేక జీవిస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. టీవీలు, సెల్‌ఫోన్లు వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతంలో కళా రూపాలు అంతరించిపోతున్నాయని, వారి సమస్యలపై అవగాహన కలిగించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజానాట్యమండలి రైతులు, కార్మికులు, మహిళల సమస్యలపై నాటికలను రూపొందించి చైతన్యాన్ని కలిగిస్తోందని చెప్పారు. అటువంటి ప్రజానాట్య మండలిని అందరూ ఆదరించాలని, ఆగస్టు 15న జరగనున్న దేశభక్తి గేయాల పోటీల్లో విద్యార్థిని విద్యార్థులతో పాటు అనేక మంది యువకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు బోనెల పరశురాం, బిడ్డిక నాగేశ్వరరావు, వి.అంగదా, ఏగిరెడ్డి పైడిపునాయుడు, పి.లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి మహాప్రభో!

గ్రీన్ అంబాసిడర్లు వేడుకోలు

ప్రజాశక్తి - సీతానగరం

ఒకవైపు పాలకులు, అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి, అంటు వ్యాధులు ప్రబలకుండా చెత్తాచెదారాలను తొలగించాలంటూ ఆదేశాలు ఇస్తున్నారు. మరోవైపు ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరించే కార్మికులకు దీర్ఘకాలంగా వేతనాలు చెల్లించకపోవడంతో అర్ధాకలితో విధులు నిర్వహిస్తున్నారు. అసలే అరకొర వేతనాలు, అవి కూడా సకాలంలో చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు మండలంలో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లే నిదర్శనం

మండలంలోని గ్రీన్ అంబాసిడర్లకు 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పస్తులతో అలమటిస్తున్నామని రంగంపేట పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ రాయిపల్లి నారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టినప్పుడు ఎంతో సంతోషించామని, తమ బాధలు తీరుతాయని ఆశించామని, కానీ ఈయన కూడా గత పాలకుల బాటలోనే నడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే తమకు బకాయి ఉన్న 10నెలల వేతనం చెల్లించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

నాసిరకంగా బాగుజోల- సిరివర రోడ్డు

- షోల్డర్లు లేక కోతకు గురువుతున్న రహదారి
- వాహనాల తాకిడికి పాడైన సిసి రోడ్డు

ప్రజాశక్తి - మక్కువ

గిరి శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించే సదుద్దేశంతో చేపడుతున్న పనులు నత్తనడకన సాగడమే కాకుండా, నాసిరకంగా చేపడుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సాలూరు -మక్కువ మండలాల్లోని కొండల ప్రాంతంలో గల గిరిజనులకు రహదారి సౌకర్యం కల్పించాలని సదుద్దేశంతో సుమారు రూ.9 కోట్ల వ్యయంతో రహదారి పనులకు శంకుస్థాపన చేపట్టారు. సుమారు 6.5 కిలోమీటర్ల గల ఈ రహదారి పనులు కొన్నిచోట్ల సిమెంట్ రహదారితో పాటు బిటి రోడ్డుకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం చిలకపెండంగి వరకు రహదారి రూపురేఖలు దిద్దుకుంటుండగా, ఇంకా సిరివర వరకు పూర్తిస్థాయి పనులు జరగాల్సి ఉంది.

షోల్డర్లు లేక కోతకు గురవుతున్న రహదారి

రహదారికి ఇరువైపులా కొన్నిచోట్ల షోల్డర్లు లేకుండా నిర్మాణం చేపట్టడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఇటు సిమెంటు రోడ్డుతో పాటు బిటి రోడ్డు కూడా కోతకు గురవుతోంది. రహదారికి ఇరువైపులా పూర్తిస్థాయిలో షోల్డర్లు నిర్మించకుంటే ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న రహదారికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా 1.7మీటర్లు చొప్పున షోల్డర్లు నిర్మించాల్సిన ఉన్నా, ఎక్కడా ఇలా నిర్మించకపోవడంతో వాహనాల తాకిడితో పలు చోట్ల సిమెంట్ రహదారులు కూడా దెబ్బతిన్నాయని వారు చెబుతున్నారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే ఉంటుందని ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారిపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, పటిష్టంగా రహదారి రోడ్డు జరిగేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.



కోతకు గురవుతున్న రహదారి



ప్రారంభంలోనే పెచ్చులుడిని సిసి రహదారి

ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొమరాడ

నియోజవర్గంలో ప్రతి ఏజెన్సీ మారుమల గ్రామానికి ఇంటింటికి కుళాయిల ద్వారా మంచినీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఆర్తాం పంచాయతీ సీతామాంబపురంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.19.10 లక్షలతో పదివేల లీటర్ల రక్షిత మంచినీటి పథకాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంచినీటి ట్యాంకు వద్ద రిబ్బన్ కత్తిరించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి మంచినీటి ట్యాంకు ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఇంటింటికీ మంచినీరందించేందుకు జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నీరందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వ అందించిన పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామం చిన్నదైనప్పటికీ ఇంటింటికి తాగునీరందించేందుకు ప్రభుత్వం ట్యాంక్ మంజూరు చేసి పనులు పూర్తి చేసి నీరందవ్వడంపై గ్రామస్తుల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు, పాఠశాల భవనం తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టిలోకి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌరునాయుడు, మండల టిడిపి అధ్యక్షులు సేనాపతి శేఖర్ పాత్రుడు, నాయకులు దేవకోటి వెంకటనాయుడు, ఎంపిటిసి సభ్యులు గంట వెంకటనాయుడు, ట్రైకార్ రాష్ట్ర డైరెక్టర్ పి.లావణ్య, నాయకులు దత్తి లక్ష్మణరావు, ఎన్.మధుసూదన్‌రావు, పి.వెంకటనాయుడు, సర్పంచ్ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ శంకరరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పాఠశాల భవనం మంజూరు చేయండి

ప్లే కార్డులతో విద్యార్థులు ప్రదర్శన

తమ గ్రామానికి నూతన పాఠశాల భవనం మంజూరు చేసి తమ భవిష్యత్తుకు పునాది వేయాలని ఆ గ్రామానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు ఎమ్మెల్యేకు ప్లే కార్డులతో సమస్యను తెలియజేశారు. ఆర్తాం పంచాయతీ సీతమాంబపురంలో పూర్వకాలం నిర్మాణం చేపట్టిన పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. ఈ భవన పెచ్చులు పడిపోయి ప్రమాదాలు బారిన పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 27 గడపలు ఉన్న ఆ గ్రామంలో పదిమంది విద్యార్థిని విద్యార్థులు ఆ భవనంలో చదువుకుంటున్నారు. పదిమంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయురాలు ఉన్నప్పటికీ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో శిథిలావవస్థలో ఉండడంతో బిక్కుబిక్కుమంటూ పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఉపాధ్యాయురాలు తెలిపారు. తమ గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు పాఠశాల భవనం సమస్యను వివరించేందుకు విద్యార్థులు ప్లే కార్డులతో తమ సమస్యను తెలియజేసి కొత్త భవనం మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై పాఠశాల ఉపాధ్యాయురాలు కలెక్టర్‌కు, డిఇఒకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టిలో పెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యకు ఎమ్మెల్యే స్పందించి భవనాన్ని పరిశీలించి, కొత్త భవనం మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



పాఠశాల భవనం నిర్మించాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



క్రీడాకారులకు పరికాలు అందజేస్తున్న వీరేష్‌చంద్రదేవ్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కురుపాం

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ అన్నారు. శుక్రవారం కురుపాంలో ఆయన కోట వద్ద ఫుట్‌బాల్ ఆడుతున్న యువతకు ఫుట్‌బాల్‌కు అవసరమైన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఆరోగ్యానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. కావున యువతకు చదువు ఎంత ముఖ్యమో శారీరక ఆరోగ్యం కూడా అంతే అవసరమని, కావున చదువుతో పాటు ప్రతి యువకుడు క్రీడల్లో రాణించి ఉన్నత స్థానంలో స్థిరపడి కుటుంబానికి భరోసాగా ఉండాలని సూచించారు.



రైతులతో విత్తన శుద్ధి చేయిస్తున్న సిబ్బంది

విత్తన శుద్ధితోనే అధిక దిగుబడి

ప్రజాశక్తి - కురుపాం

విత్తన శుద్ధితోనే పంటలు అధిక దిగుబడి సాధ్యమని ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి. అన్నపూర్ణ అన్నారు. మండలంలోని సీతంపేటలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు విత్తన శుద్ధి సాగు పద్ధతులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా తమ విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకుంటే గాలి, నీరు, విత్తనం, ద్వారా సంక్రమించే హానికరమైన క్రిమి, కీటకాల నుంచి రక్షణ ఉంటుందని, తెగుళ్లను తట్టుకొని బాగా దిగుబడి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్, సిబ్బంది ప్రసాద్, దాశరధి, నాగేశ్వరావు, సత్యనారాయణ, రైతులు మర్రాపు స్వామినాయుడు, సత్యంనాయుడు, పోల ఉష, పొల త్రినాథ తదితరులు పాల్గొన్నారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక అడ్వెంచర్ పార్క్ వద్ద శుక్రవారం సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు చేపట్టే మితిమీరి వేగంతో వెళ్లరాదన్నారు. పరిమితి మించిన ప్రయాణికులను ఎక్కిస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఓవర్ లోడ్ వేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనం అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గుట్కా అమ్మితే ఆ షాపులకు అపరాధ రుసుం విధించామని తెలిపారు.



చిన్నారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారులు

మాకు అవకాశమిస్తే పాపను సంరక్షిస్తాం

ప్రజాశక్తి - కొమరాడ

తల్లి మృతి చెంది తండ్రి జీవిత ఖైదీగా ఉన్నప్పుడు ఆ పాపని తమకు ఇస్తే సంరక్షించుకుంటామని కొమరాడ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి జి. సుగుణ కుమారి అన్నారు. గురువారం 2వ అదనపు జిల్లా కోర్టులో మండలంలోని సంకేసు గ్రామానికి చెందిన మండంగి గణపతికి యావజ్జీవ శిక్ష విధించడంతో అతని కూతురు అనాధగా ఉందన్న విషయం తెలుసుకొని శుక్రవారం గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. ఆ పాప సంరక్షణ ప్రభుత్వం చూసుకుంటుందని తమకు అప్ప చెప్పినట్లయితే బాలసదనంలో చేర్పించి పూర్తి బాధ్యత తీసుకుంటామని చెప్పారు. తల్లి చనిపోయినప్పటి నుంచి పాపను వాళ్ల మేనత్త మండంగి నల్లమ్మ సంరక్షిస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ సత్యనారాయణ, ఎస్ఐ కె నీలకంఠం ,సూపర్వైజర్ అరుణ, కౌన్సిలర్ తవిటినాయుడు, గ్రామ పెద్దలు రామారావు, రగురాజు, సావిత్రి, ఎమ్మెస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాటు సారాతో ఇద్దరు వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - కురుపాం

కారులో అక్రమంగా నాటు సారా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది జరిపిన దాడుల్లో రావాడ, వట్టిగెడ్డ ప్రాజెక్టు సమీపంలో కాపుకాసి కారుతో పాటు 300 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒడిశా సందుబడి నుంచి చినమేరంగి, కోదుల గుమడకు నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నాటు సారాను ఎవరైనా అమ్మినా, తయారు చేసినా, తరలించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై జె. రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులకు పట్టుబడి నాటుసారా, నిందితులు

రీ సర్వేలో తప్పులుంటే 15 రోజుల్లో పరిష్కారం

ప్రజాశక్తి - కొమరాడ

గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే ప్రక్రియలో భూరికార్డులో తప్పులుంటే తమ దృష్టికి తీసుకొస్తే 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ సిహెచ్.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో గత మూడు నెలలు జరిగిన అభివృద్ధి పురోగతిపై వివిధ శాఖల వారీగా సమీక్షించారు. తొలుత వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ ఇప్పటి వరకు రైతులకు అందించిన విత్తనాలు, ఎరువులు వివరాలను తెలుపగా ఇప్పటి వరకు యూరియా, పొటాస్ ప్రభుత్వం ద్వారా పంపిణీ కాలేదని, దీంతో బ్లాక్‌లో ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి అధికంగా అమ్మకాలు జరుపుతున్నారని తొడుము సర్పంచ్ వై.సింహాచలంనాయుడు ఆరోపించారు. దీంతో పొటాష్, యురియా, ఇతర పంటలకు అవసరమైన ఎరువును ప్రభుత్వం రాయితీపై ఇవ్వకపోవడంతో రైతులకు ఆర్థికంగా భారవుతుందన్నారు. ప్రభుత్వం స్పందించి సకాలంలో రైతులకు యూరియా, పొటాస్ సబ్సిడీపై అందించాలని కోరారు. రైతులకు అవసరమైన ఎరువులు అందజేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యాశాఖ అధికారి తిరుపతినాయుడు మాట్లాడుతూ గురువారం మెగా పేరెంట్స్ సమావేశం విజయవంతమైందని తెలపగా, పలువురు సర్పంచులు మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతమందిని చేర్చారని ప్రశ్నించగా ఎంఇఒ సమాధానం చెప్పలేకపోయారు. ఒట్టి సమావేశాలు ఎందుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరికలు జరిగినప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే ప్రయోజనమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా,

మండల సర్వసభ్య సమావేశంలో తహశీల్దార్



మండల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సత్యనారాయణ

పంచాయతీలో నిధులు లేక ఎటువంటి పనులు చేయలేకపోతున్నామని సర్పంచ్ల ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జంఝావతి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా ఈనెల 18నుంచి సాగునీరు విడుదల చేస్తామని ప్రకటించారు. రెవెన్యూ సమస్యలపై తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలున్నట్లు గుర్తించానన్నారు. రీ సర్వేలో రైతుల భూ వివరాలు తప్పులు పడిన వారు తమను సంప్రదిస్తే 15 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు ఎవరు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విఆర్ఒలు, సర్వేయర్లు ఎటువంటి ఇబ్బందులు పెట్టినా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే తాను దర్యాప్తు చేసి రైతుల సమస్యలు పరిష్కారానికికృషి చేస్తారని భరోసా ఇచ్చారు. సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు డి.లక్ష్మి, ఎంపిడిఒ ఎస్.రమేష్, వైస్ ఎంపిపి ఎన్.శరత్‌బాబు, వివిధ మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కరించని సమావేశాలు ఎందుకు : సిపిఎం

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో సమస్యలపై అధికారులకు వినతి ఇవ్వడానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న బస్సు సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాయంత్రం 6 దాటితే పార్వతీపురం నుంచి కూనేరు రావడానికి బస్సు సేవలు లేకపోవడంతో ఆటోలను బుక్ చేసుకొని రావడంతో ప్రయాణికులకు ఆర్థికంగా భారం అవుతుందని తెలిపారు. రోడ్లు కొంతమేరకు బాగున్నప్పటికీ బాగోలేదని బస్సులు నడపలేమని ఆర్టీసీ చేతులెత్తేయడం సరైన పద్ధతి కాదన్నారు. అలాగే పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి జీవో తెచ్చాం.. ఇదిగో పనులు చేస్తాం.. అదిగో చేస్తామని చెబుతున్నారు తప్ప పనులు మాత్రం ప్రారంభం కావడం లేదన్నారు. ఈ ఏడాది కూడా పనులు చేసేందుకు సీజన్ పూర్తి కావడంతో వంతెన పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని అధికారులు ప్రశ్నించారు. ఇలా అనేక సమస్యలున్నా పట్టించుకోనప్పుడు ఇలాంటి సమావేశాలు తూతూ మాత్రమే పెట్టి సంతకాలు పెట్టి వెళ్లిపోవడం ఎంతవరకు సమంజసం మనీ ప్రశ్నించారు. ఇప్ప టికైనా అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వంతోనే రైతు సంక్షేమం, మార్కెట్ యార్డుల అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కురుపాంలో వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయంలో వ్యవసాయాన్ని తుంగలో తొక్కి రైతుల నడ్డి విరిచి మార్కెట్ యార్డ్‌లను గాలికి వదిలేశారని ఆరోపించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. అందులో భాగంగానే రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్ యార్డు ద్వారా కొనుగోలు చేసి మార్కెట్ యార్డులన అభివృద్ధి చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారని అన్నారు. కావున ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా



ఎంఎంసి నూతన కార్యవర్గంచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మార్కెట్ కమిటీ అంతా పని చేయాలని సూచించారు. అనంతరం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా కడ్రక కళావతి, వైస్‌చైర్మన్‌గా గారా గౌరీ శంకరరావుతో పాటు 12 మంది పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ కడ్రక కళావతి మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎమ్మెల్యే జగదీశ్వరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్ర దేవ్ సూచనలు, సలహాలు పాటిస్తూ అభివృద్ధి పనులు, భవిష్యత్తు కార్యకలాపాలపై వారితో చర్చించి మార్కెట్ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, ట్రైకర్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ పువ్వల లావణ్య, కూటమి నాయకులు దత్తి లక్ష్మణరావు, కోలా రంజిత్ కుమార్, కడ్రక మల్లేష్, కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల టిడిపి కన్వీనర్లు కెవి కొండయ్య, అడ్డాకుల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పూర్తిస్థాయిలో యూరియా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి కొమరాడ

రైతులకు రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ జోరుగా ఉందని మరికొన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా కోసం రైతులు ఎదురుచూపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులకు అవసరమైన యురియా పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు అన్ని విధాలా ఎరువులు అందించడంలో ఎటువంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ చెప్పినప్పటికీ ఆ దిశగా మండలంలో కొన్ని రైతు సేవా కేంద్రాలకు నేటికీ ఎరువులు రాని పరిస్థితి ఉందన్నారు. కొమరాడలోని రైతు సేవా కేంద్రానికి ఇండెంట్ పెట్టి వారం రోజులైనా ఒక్క యూరియా బస్తా కూడా రాని పరిస్థితి ఉందన్నారు. సహకార సొసైటీ ద్వారా ఒక్క లారీ యూరియా వచ్చిందని, దాన్ని ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క బస్తా ఇస్తే నాలుగైదు బస్తాలు అవసరమైన రైతు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. డిఎపి అయితే అస్సలు రాని పరిస్థితి ఉందన్నారు. చినఖేర్జెల రైతు సేవా కేంద్రానికైతే యూరియా, డిఎపి రాని పరిస్థితి ఉందన్నారు. ఇలా చూసుకుంటే మండలంలో కొన్ని రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు రాని పరిస్థితి ఉందని అన్నారు. చోళపదంలో స్టాకు ఉన్నప్పటికీ అక్కడ వ్యవసాయ శాఖ అధికారి బదిలీ కావడం, కొత్తగా ఎవరూ రాని పరిస్థితుల్లో యూరియా పంపిణీకి ఏ అధికారి ముందుకు రాని పరిస్థితి ఉందన్నారు. ఇలా చూసుకుంటే మండలంలో అనేక రైతు సేవా కేంద్రాలకు ఎరువులు రాని పరిస్థితి ఉందని, కావున అధికారులు స్పందించి రైతులకు సరిపడా ఎరువులను అందజేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నియామకాల్లో పారదర్శకత కనిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా త్వరలో చేపట్టనున్న నియామకాల్లో పారదర్శకత కనిపించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, తీళ్ల గౌరీ శంకరరావు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో చేపట్టిన నియామకాల్లో పలు అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈసారి నియామకాల్లో పారదర్శకత పాటించాలన్నారు. ఈసారి గతంలోలా నియామకాల్లో ఆరోపణలు రాకూడదని, నియామకాలు రద్దు చేసే దుస్థితి అస్సలు రాకూడదని అన్నారు. ఇప్పటికే ఆశా కార్యకర్తల నియామకాలకు సంబంధించి గ్రామాల్లో పలు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. దళారులు రంగ ప్రవేశం చేసి ఆశా కార్యకర్తల ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రూ.2లక్షలు వరకు బేర సారాలు ఆడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అక్కడక్కడ వసూళ్లు కూడా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆయా ఆరోపణల్లో వైద్య సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు లేకుండా శాఖాపరమైన హెచ్చరికలు జారీ చేయాలన్నారు. నిబంధనలు ప్రకారమే ఆశా కార్యకర్తలను నియమించాలన్నారు. కమిటీల ద్వారా నియామకం అనేది జరిగితే గ్రామాల్లో రాజకీయ బలం ఉన్న వారికే దక్కే అవకాశం ఉందన్నారు. మెరిట్‌కు అవకాశం దక్కకపోవచ్చని, కాబట్టి పారదర్శకంగా నియామకాలు జరిగేలా చూడాలని కోరారు. అలాగే జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా పిపిఎం కోఆర్డినేటర్, సీనియర్ టిబి హెచ్ఐవి సూపర్వైజర్, అకౌంటెంట్ తదితర ఉద్యోగాలు నిబంధనలు ప్రకారం చేపట్టాలన్నారు.

విఆర్ఎస్ అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రామవరంలో జరుగుతున్న వెంగళరావుసాగర్ అభివృద్ధి పనులను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శుక్రవారం పరిశీలించారు. కాంట్రాక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతలో లోటుపాట్లు లేకుండా పక్కాగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలోపు పనులన్నీ పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వెల్లడించారు. చాలాకాలంగా పెండింగ్లో ఉండిపోయిన ప్రాజెక్టులను పూర్తి చేసి సమృద్ధిగా పంటలకు సాగునీరందించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ పెంకి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఆక్రమణలపై వివరాలు సేకరించాలి : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పరిధిలో ఉన్న పలు చెరువుల గట్లపై ఉన్న అక్రమ నిర్మాణాల వివరాలను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల కమిషనర్ చాంబర్లో టిపిఎస్ వెంకట నారాయణరావు, సచివాలయాల టౌన్ ప్లానింగ్ సెక్రటరీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా చెరువుగట్లపై జరిగిన అక్రమ నిర్మాణాలపై వివరాలు సేకరించాలన్నారు. వీటితో పాటు పట్టణ పరిధిలో గల చెరువులను సంరక్షించుకునే బాధ్యత మున్సిపాలిటీదేనని తెలిపారు. రెండు వారాల్లో ఆక్రమణలపై పూర్తి నివేదిక అందజేయాలని టౌన్ ప్లానింగ్ సెక్రటరీకి సూచించారు. టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా అక్రమ భవనిర్మాణాలను చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య సముదాయాలను నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేయకూడదని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధిపై ముందుగా ప్రణాళికలతో పాటు అంచనాలు కూడా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ జి.సత్యం నాయుడు, పంచాయతీరాజ్ జెఇ డి.కల్యాణదుర్గ, ఎపిఎం కె.రాము, మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎలో ఉన్న వెలుగు మీటింగ్ హాల్లో గ్రామపంచాయతీ పురోగతి సూచికలు అన్న అంశంపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.సత్యం మాట్లాడుతూ గ్రామపంచాయతీ పురోగతి సూచికలనేవి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కావున అన్నిశాఖల వారు డేటా సమకూర్చి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని సచివాలయాల డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు రామకృష్ణ, వినోద్, అప్పలసూరి, శ్యామ్, రామేశ్వరరావు పాల్గొన్నారు.

కొడిశను పరిశీలించిన రాష్ట్ర బృందం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల కొడిశ గ్రామాన్ని ఎసిఎం పిచికారీ రాష్ట్ర పరిశీలకులు ఎస్.రామచంద్రుడు శుక్రవారం పరిశీలించారు. అనంతరం మల్లిలోని ప్రతిభా కళాశాలలో పిచికారీ ఎలా చేశారో పరిశీలించారు. సీతంపేటలో బాలికల గురుకుల పాఠశాలలో చేపట్టిన పిచికారీ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిచికారీ రాడికల్‌ను పరిశీలించారు. ఇంటి లోపల తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయాలన్నారు. ఇప్పటి వరకు స్ప్రేయింగ్ చేసినవి బాగానే చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో క్షుణంగా పరిశీలించి, విద్యార్థుల జ్వరాలపై ఆరా తీశారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి శివశంకర్, సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహన్ రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న రామచంద్రుడు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కంటోన్మెంట్ : పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో వివాహిత బి. మణి(24) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నెల్లిమర్ల మండలం టొంపల పేటకు చెందిన మణికి పూసపాటిరేగ మండలం ఎరుకొండ గ్రామానికి చెందిన సురేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా వీరిద్దరి మధ్య వివాదం ఉంది. రెండు వారాలు క్రితం రాజీవ్ నగర్ కాలనీలో నివాసముంటున్న మృతురాలి పెద్దమ్మ తన ఇంటికి మణిని తీసుకొచ్చింది. గతంలో మణికి పరిచయమున్న ఎరుకొండ గ్రామానికి చెందిన బి.సాయికుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుని వారిద్దరూ విజయవాడకు వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు తిరిగి మృతురాలిని తన పెద్దమ్మకు అప్పగించారు. బంధువులు తనను మందలించడంతో మనస్థాపానికి గురైన మణి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి టొంపల సూర్యం తన కుమార్తె మృతికి సాయికుమార్ కారణమని పోలీసులుకు ఫిర్యాదు చేసింది.

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - కంటోన్మెంట్, డెంకాడ

ప్రియుడు వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన భోగాపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఎస్ఐ సూర్యకుమారి తెలిపిన వివరాలు మేరకు. మండలంలోని నారుపేట గ్రామానికి చెందిన అట్టాడ పుష్ప(22), చోడవరం మండలం మాడుగల గ్రామానికి చెందిన సాయి గత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత కొద్ది రోజులగా ప్రియుడు సాయి వేధింపులు తాళలేక గురువారం రాత్రి ఇంట్లో ప్యానుకు చీరతో ఉరి వేసుకొని పుష్ప అత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు తగరపువలస ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు మృతురాలు ఓ ప్రైవేటు పరిశ్రమలో ఫిల్లింగ్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పాత ఎదురువాడలో ఏనుగులు హల్‌చల్

సీతంపేట : మండలంలోని పాత ఎదురువాడలో గత రెండు రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. దీంతో ఆ చుట్టుపక్క గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కొండ పోడుకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఏ రాత్రి, ఎవరిపై దాడి చేస్తాయోనని బిక్కిబిక్కిమంటున్నారు. ఏనుగులు ఇప్పటికే పైనాపిల్, కొండచీపుర్లును నాశనం చేస్తున్నాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.